భార్య హోదా
దక్కినా
తల్లి హోదా
ఆమెకు
ఎందుకు లభించలేదు?

# తాహతు

పొలంకి సత్య కథ

"ఏమంటావురా, అన్నయ్యా"

విషయం చెప్పిన గంటలోనే మూడోసారి సరస్వతి సీతాపతిరావుని అడిగింది. చెల్లెలికి ఏం చెప్పాలో తెలియక సీతాపతిరావు భార్య వైదేహివైపు చూశారు.

జవాబు చెప్పే బాధ్యతను తనమీదకు తోసేసిన భర్త మీద కోపం వచ్చింది వైదేహికి. కోపాన్ని పైకి కనబడనీయకుండా "అమ్మాయితో కూడా ఆలోచించాలి కదా" అంది.

సరస్వతి కోడలు సిజేరియన్ ఆపరేషన్ చేసే డాక్టరు అజాగ్రత్తవల్ల చనిపోయింది. మొదటి కాన్పు నార్మల్ డెలివరీలో పుట్టిన మూడేళ్ల బాబునీ, రెండోసారి పుట్టిన నెల నిండని పాపనీ పెంచే బాధ్యత సరస్వతిమీద పడింది. ఆమెది పిల్లల్ని పెంచే వయస్సు కాదు. కొడుక్కి పునర్వివాహం చేసి పిల్లల బాధ్యత కోడలికి అప్పగించాలని ఆమె కోరిక. పరాయి ఇంటినుంచి వచ్చిన పిల్ల బాధ్యత సక్రమంగా నిర్వహించకపోవచ్చు. అందుకే మేనకోడల్నే కోడలిగా చేసుకోవాలని ఆమె ఆరాటం.

అందుకే వచ్చినప్పటినుంచీ ఇంకే విషయమూ మాట్లాడంలేదు.

▶ ◆ ◀

సాయంత్రం నాలుగు గంటలకు సీతాపతిరావు కూతురు వీణ ఇంటికి వచ్చింది. స్కూల్లో పిల్లలకు పాఠాలు చెప్పిన అలసట ఆమె ముఖంలో స్పష్టంగా కనిపిస్తోంది.

కూతురికి కాఫీ తెచ్చి ఇచ్చి "మీ అత్తయ్య వచ్చారు" అంది వైదేహి.

వీణ కాఫీగ్లాసులోనే వెళ్లి "అత్తయ్యా,



కులాసానా" అని పలకరించింది.—

"ఏం కులాసామ్మా, వీణా. ఇద్దరు పిల్లలతో సతమతమైపోతున్నాను. ఇంకో గంటలో వెళ్ళిపోవాలి. సాయంత్రానికి వచ్చేస్తాము, కాస్త చూడమని మా పక్కింటావిడకు చెప్పి వచ్చాను. అన్నయ్యా, వీణతో మాట్లాడి ఏ సంగతీ త్వరగా చెప్పు"

వీణ తండ్రికేసి విషయం ఏమిటన్నట్లు

చూసింది.

సీతాపతిరావు డాబాపైకి దారితీశారు.

▶ ◆ ◀

మేనత్త కోరిక విన్న వీణ ముఖం గతం గుర్తుకురాగా జేవురించింది.

వీణ పుట్టినప్పటిమంచీ "మా మేనకోడ లే మా కోడలు" అంటూ వుండేది సరస్వతి. అందరినోటా అదే మాట వింటు న్న వీణ బావనే భర్తగా ఊహించుకునేది. ఆమెలో తన బావే తన భర్త అన్న ముద్ర చిన్ననాడే బలంగా పడిపోయింది.

సరస్వతి కొడుకు శ్రీధర్ సెక్రటేరి యట్‌లో సెక్షన్ ఆఫీసరయ్యాడు. వీణ బి.ఏ పాసయింది. ఇంక అమ్మాయికి మేనల్లు డితో పెళ్లి చేసెయ్యాలనుకున్నారు సీతాపతి రావు.

"ముందునుంచీ అనుకున్న సంబంధమే అయినా మనం ఒకసారి వెళ్లి అడగడం విధాయకం" అంది వైదేహి.

అనవసరమన్నట్లుగా చూశారు సీతాపతి రావు.

"మీ చెల్లెలు చిన్నప్పటినుంచీ వీణ మా కోడలు అన్న మాట నిజమే. కానీ ఆడపడు చు లాంఛనాలు, అప్పగింతల బట్టలువంటి మిగతా విషయాలు మాట్లాడుకోవాలిగా. మంచిరోజు చూసుకుని వెడదాం" అంది వైదేహి.

సరేనన్నారు సీతాపతిరావు.

మంచిరోజున సీతాపతిరావూ, వైదేహీ వెళ్లి మా అమ్మాయి వీణను మీ అబ్బాయి శ్రీధర్‌కి చేసుకోమని అడగడానికి వచ్చాం" అని చెప్పేరు.

శ్రీధర్‌కానీ అతని తండ్రికానీ మాట్లా డే అవకాశం సరస్వతి ఇవ్వలేదు.

"ఏదో వీణ చిన్నప్పుడు నేను సరదాగా అన్నాననకానీ మీరు ఆ మాటని పట్టుకుని వస్తారని అనుకోలేదు. మేనరికాలు మంచివి కావని డాక్టర్లు అంటున్నారుగా"

ఆమె మాటల్లో లౌక్యం తెల్సిన వైదేహి మండిపడింది. వీణ చిన్నప్పుడు అవడమేమి టి మొన్న మొన్నటిదాకా, శ్రీధర్ గవర్నమె ంట్‌లో ఆఫీసరయ్యేదాకా అంటూనే వుంది. అన్నగారు కట్నం ఎక్కువ ఇవ్వలేదన్న సంగతి సరస్వతికి బాగా తెలుసు. అందుకే మేనరికాలు మంచివి కావని చెప్తోంది.

సీతాపతిరావుగారు ఏదో చెప్పబోయేరు కానీ వైదేహి చెప్పనివ్వలేదు.

ఈ సంఘటన జరిగిన నెల్లాళ్లకే లక్ష రూపాయల కట్నంతో శ్రీధర్‌కి పెళ్లయిం ది.

వీణ బి.ఇడి. చదివి ప్రైవేటు స్కూల్లో టీచరుగా జాయినయింది. ఆమె చేసే చిన్న ఉద్యోగంకానీ, ఆమె తండ్రి ఇవ్వగలిగిన కట్నంకానీ ఎవరికీ నచ్చడంలేదు. శ్రీధర్ ఇద్దరు పిల్లల తండ్రయినా, వీణ అవివాహిత గానే వుండిపోయింది.

ఈనాడు మేనత్త మళ్లీ తననే కోడలిగా కోరుకుంటోంది.

"ఏమంటావమ్మా వీణా" తండ్రి మా టల్తో ఈ లోకంలోకి వచ్చింది వీణ.

"ఆనాడు మంచివి కాని మేనరికాలు ఈనాడు మంచివయ్యేయా నాన్నా" వీణ కంఠంలో వ్యంగ్యమూ, కోపమూ సమంగా చోటుచేసుకున్నాయి.

"మీ అత్తయ్య ఆ ప్రశ్నకు ముందే సమాధానం చెప్పింది. శ్రీధర్‌కి పిల్లలు పుట్టరు. మేనరికాలవల్ల జన్మించే పిల్లలకు అవకరాలుండవచ్చునని కదా డాక్టర్లు చెప్తున్నారు. శ్రీధర్‌కి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ జరిగింది. సవతి పిల్లలనే సొంతపిల్లలుగా చూసుకునే అమ్మాయికోసమే ఆరాటం. నువ్వు మేనకోడలివి కాబట్టి కష్టం, సుఖం తెలుసుకుని బాధ్యతగా వుంటావని అత్తయ్య ఆశ"

వీణకి కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"నీ ఇష్టానికి వ్యతిరేకంగా ఏం చెయ్యనమ్మా వీణా. కానీ ఆలోచించుకో. శ్రీధర్‌కి చదువూ, అందం, ఉద్యోగం అన్నీ వున్నాయి. తనే వచ్చి అడిగింది కాబట్టి అత్తయ్యకి కట్నం ఆశే వుండదు. మన తాహతు కూడా ఆలోచించుకో. నాలుగేళ్లుగా నీకు పెళ్లి చేయలేకపోయాను"

సీతాపతిరావు డాబా దిగి వెళ్లిపోయారు.

వీణ చాలాసేపు డాబామీదనే కూర్చుండిపోయింది. ఎంతో సేపటికి ఆమె ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చాయి.

డాబా దిగి వచ్చిన వీణ మేనత్తకు విన్పించేలా తల్లితండ్రులతో చెప్పింది. "నేను పిల్లలంటే ఎంత ఇష్టపడతానో మీ ఇద్దరికీ తెలుసు. పిల్లలంటే ఉన్న ఇష్టం వల్లే స్కూల్లో టీచరుగా చేరాను. నా కడుపు పండాలనీ, నాకు పుట్టే పిల్లలని ఎంతో ప్రేమగా పెంచుకోవాలనీ ఎంతగానో కలలు కన్నాను. మాతృత్వ కాంక్షను నేను ఎట్టి పరిస్థితిలోనూ చంపుకోలేను. నాకు పిల్లలను ఇవ్వదల్చుకోలేని ఆఫీసర్‌కన్నా పిల్లను ఇచ్చే కూలీనైనా సరే పెళ్లిచేసుకుంటాను"

వీణ మాటలు విన్న సరస్వతి రుసరుసలాడుతూ బొట్టయినా పెట్టించుకోకుండా వెళ్లిపోయింది.

▶ ◆ ◀

## దటీజ్ అమితాబ్



సూపర్‌స్టార్ అమితాబ్ బచన్ తాను సినీరంగంలోకి వచ్చిన రోజుల్ని గుర్తు తెచ్చుకుంటూ ఆ రోజుల్లో ప్రేక్షకులు ఎంతో ఓపిగ్గా వుండేవాళ్లు! మా బలహీనతల్ని పట్టించుకోకుండా మా 'నటన' పరిపక్వం కావడానికి ఎంతో సమయం ఇచ్చారు! మరి ఇవాళ పరిస్థితి వేరు. నేటి యువ హీరోలు మొదటి సినిమాలో సరైన నటన ప్రదర్శించకపోతే వారికి రెండో ఛాన్స్‌రావడమే కష్టమయ్యే క్లిష్టమైన రోజులివి'' అంటూ నేటి హిట్ హీరోలకు కంగ్రాట్స్ చెప్తున్నాడాయన! దటీజ్ అమితాబ్!

- జూపిటర్

నాలుగేళ్లు గడిచాయి. శ్రీధర్‌కి పెళ్లయింది. అతని రెండో భార్య పిల్లల్ని బాగా చూస్తుందని వార్తలు వస్తుండేవి.

వీణకి పెళ్లికాలేదు. అసలు పెళ్లి చేయగలమా, లేదా అన్న బెంగ సీతాపతిరావు దంపతులలో ఉదయించింది. మేనత్త వచ్చి స్వయంగా అడిగినప్పుడు తిరస్కరించి వీణ తప్పుచేసిందన్నట్లుగా వాళ్లిద్దరూ మాచాయగా అనేవారు. తానుచేసింది తప్పా అన్న భావంతో వీణలో కూడా కలగసాగింది. తల్లిదండ్రుల గుండెలమీద కుంపట్లా తయారయింది తను. అమ్మా అనిపించుకోవాలన్న కోరికను జయించి వుండాల్సిందా?

▶ ◆ ◀

"సీతాపతీ" అంటూ శ్యామల్రావు లోపలకు వచ్చాడు.

"వీణకి ఒక మంచి సంబంధం తెచ్చేనయ్యా. అబ్బాయి బ్యాంకులో ఆఫీసరు. అత్తా, ఆడపడుచుల పోరు లేదు. ఎటొచ్చీ పెళ్లికొడుకు అన్నయ్య ఆక్సిడెంట్‌లో పోయాడు. వదినగారు కోమాలో హాస్పిటల్లో వుంది. ఎప్పటికీ కోలుకోకపోవచ్చునట. ఆ అన్నయ్య పిల్లల బాధ్యత మాత్రం మన అమ్మాయిదే"

"దానికేముందిలే. బ్యాంకు ఆఫీసరంటే ఏడెనిమిది వేలు జీతముంటుందిగా. ఇద్దరు పిల్లలకు చదువు చెప్పించడం కష్టమేముందిలే. ఇంతకీ కట్నమెంతలో వున్నారో?"

"అన్నిటికన్నా సంతోష విషయమదే. అబ్బాయికి గుణం ముఖ్యంట కట్నమేమీ వద్దుట"

సంతోషంతో సీతాపతిరావుకీ, వైదేహికీ నోటమాట రాలేదు. వీణకి ఆకాశాన్నందుకున్నట్లనిపించింది.

▶ ◆ ◀

పెళ్లిచూపులలో వీణ మెల్లిగా తలెత్తి నరేష్‌వంక చూసింది. ఎంత అందంగా వున్నాడు. ఇన్నాళ్లకి తన కలలు పండబోతున్నాయి.

"మీ అమ్మాయితో కొంచెం మాట్లాడాలి" అన్న సురేష్ మాటలు విన్న పెద్దలంతా బయటకు వెళ్లిపోయారు.

"చూడండి వీణా, నా సంగతి మీకు పూర్తిగా చెప్పాలి. చిన్నప్పుడే అమ్మా, నాన్న పోతే మా అన్నయ్యే నన్ను పెంచేడు. తను ఫ్యాక్టరీలో వర్కరుగా పనిచేస్తూ నాకు చదువు చెప్పించాడు. ఈనాడు ఆఫీసర్నయ్యానంటే అది అన్నయ్య చలవే. అటువంటి అన్నయ్య ఫ్యాక్టరీలో ఆక్సిడెంట్‌లో పోయాడు. ఆ వార్త విన్న వదిన కోమాలోకి వెళ్లిపోయింది. అన్నయ్య పిల్లల బాధ్యత నాదే. ఇద్దరూ ఫస్టు స్టాండర్డు, ఎల్.కే.జీ చదువుతున్నారు" వివరాలన్నీ తెలుసన్నట్లుగా తల ఊపింది వీణ.

"నాకే పిల్లలుంటే వాళ్లిద్దరినీ సరిగ్గా చూడగలనా, నేను చూద్దామనుకున్నా నా భార్య చూడనిస్తుందా అన్న భయం నాలో ప్రవేశించింది. అందుకే నేను వేసక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాను. నా అన్న పిల్లలనే తన కన్న పిల్లలుగా చూసుకునే భార్యకోసమే నా అన్వేషణ. మీకు ఇష్టం లేకపోతే చెప్పండి"

వీణకు కళ్లు తిరిగినట్లనిపించింది. దారిద్ర్యం ఎంత భయంకరమైనది? చిన్నప్పుడు

ఖరీదైన బట్టలో, బొమ్మలో అడిగితే అవి మన తాహతుకి మించినవని అమ్మ చెప్పేది. మంచి మార్కులొచ్చినా మెడిసిన్ చెప్పించే తాహతు లేదన్నాడు తండ్రి. కానీ ఆడపిల్లలందరికీ సామాన్యంగా తీరే కోరిక — తల్లి కావాలన్న కోరిక — కూడా తన తాహతుకి మించిందేనా? ఇప్పుడితన్ని కాదంటే తల్లిదండ్రులకు జన్మంతా దుఃఖమే మిగులుస్తుంది. పేదవాళ్లు ఏమీ కోరుకోకూడదు. ఆఖరికి అమ్మ కావాలనికూడా ఆడపిల్లలు అమకోకూడదు.

వీణ మెల్లిగా "నాకు అభ్యంతరం లేదు" అంది.

